అన్నపూర్ణమ్మ గారి అబ్బాయి



— రావిపల్లి సూర్యనారాయణరావు

విశాఖపట్నం నుండి బయల్దేరిన ఢిల్లీ ఎక్స్ప్రెస్ మెల్లగా తాబేలు నడకను సాగుతున్నట్టనిపించింది - నెలకు పదిహేను రోజులైనా విమానంలో ప్రయాణం చేసే విష్ణువర్ధన్‌కి. అతను ఒక పెద్ద బిజినెస్ మాగ్నెట్.

విష్ణువర్ధన్, అతని శ్రీమతి అన్నపూర్ణ ఉన్న ఫస్టుక్లాస్ కంపార్ట్‌మెంట్లో మరో యిద్దరు - శ్రీపతి, కీర్తి కూర్చుని వున్నారు.

అన్నపూర్ణను పెళ్లి చేసుకుని మూడు పుష్కరాలు దాటినా ఆమెకు విష్ణువర్ధన్ ఆదర్శభావాలు అలవడినట్టు లేదు. అయినా విష్ణువర్ధన్ అన్నపూర్ణ మాటకు ఎదురు చెప్పడు. సమాజానికి సేవచేయాలన్న ఉద్దేశంతో అన్నపూర్ణ మహిళామండలి ప్రెసిడెంటుగా నిలబడినప్పుడు - ఈ సమాజాలు ప్రజల్లో చైతన్యం తీసుకొస్తాయన్న నమ్మకం నాకు లేదు. కాని అటువంటి పనికి అవి పూనుకున్నప్పుడు సంతోషించే వాళ్లలో నేను మొదటి వ్యక్తిని - అన్నాడు విష్ణువర్ధన్. లక్షల ఆసక్తి ఉంది, ఇంకా విమానాల్లో తరచూ ఎందుకు ప్రయాణం చేస్తారు? - అని విష్ణువర్ధన్‌కి చెప్పాలనుకునే అన్నపూర్ణ, వ్యాపారం చేయడంలో అతనికి ఏదో తృప్తి వుందని గ్రహించి మౌనంగా ఉండిపోతుంది. వాళ్ల వంశానికి వారసుడైన కామేశం సంవత్సరం క్రిందట ఇంజనీరింగ్‌లో పట్టా పుచ్చుకున్నాడు. స్వతంత్ర భావాలు కల కామేశానికి విష్ణువర్ధన్ వ్యాపారసూత్రాలు వంటబట్టినట్టు లేదు.

రైలు బయల్దేరినప్పటి నుండి ఎదుట సీట్లో కూర్చున్న స్త్రీని కనురెప్ప వేయకుండా చూస్తోంది అన్నపూర్ణ. ఆమెకు ఇరవై సంవత్సరాల కంటె ఎక్కువ వయసు ఉండదు. మేలిమి బంగారం లాంటి ఛాయ, చిన్న పెదాలు, తీకైన ముక్కు, చక్రాంల్లాంటి కళ్లు... ఆ అమ్మాయి పేరేమిటో?... అటువంటి అమ్మాయి కోడలుగావస్తే, అంతకంటే అదృష్టం యింకేముంది? — మనసులో అనుకుంది అన్నపూర్ణ. ఆ విషయాన్ని రహస్యంగా విష్ణువర్ధన్ చెవిలో వేసేవరకు ఆమె మనస్సు స్థిమితపడలేదు.

రైలు వేగాన్ని పుంజుకుంది.

'నీ పేరేమిటి అమ్మాయ్?' అన్నపూర్ణ అడిగింది, ఎదుట సీట్లో అమ్మాయిని చూస్తూ.

'కీర్తి' చెప్పింది ఆమె.

'ఎంతవరకు ప్రయాణం?'

'ఢిల్లీ వెళ్తున్నాం'.

మూడో ప్రశ్న వేయడానికి మాటలు దొరకలేదు గాబోలు ఇంటర్వ్యూ ముగించింది అన్నపూర్ణ - వి...క్కున్నాడు విష్ణువర్ధన్ అన్నపూర్ణ వేసిన ప్రశ్నలు విని.

కీర్తి ప్రక్కన కూర్చున్న శ్రీపతికి యాభై ఏళ్లు నిండాయి. కాని అరవై ఏళ్లు పైబడినట్టు కనిపిస్తాడు. ప్రతీ ఐదు నిముషాలకు ఒకసారైనా దగ్గుతుంటాడు. గంట గంటకు స్పూన్లో కాస్త సిరప్ పోసి తాగిస్తుంది కీర్తి.

'ఆయన ఒంట్లో బాగులేదు కాబోలు, కాస్సేపు పూర్తిగా నిద్రపోనీ అమ్మాయ్, అదే సర్దుకుంటుంది. నువ్వు నా ప్రక్కకు వచ్చి కూర్చో...' అంది అన్నపూర్ణ.

కీర్తి ప్రక్కనున్న ముసలాయన మొహంలోకి చూసింది. తలగడను తలక్రిందకు లాక్కుని మొహందుప్పటిలోదూర్చి ప్రక్కకు వొత్తిగిలి అతను పడుకోగానే కీర్తి ఎదుటసీట్లో ఉన్న అన్నపూర్ణ ప్రక్కకు వెళ్లి కూర్చుంది.

'గులాబీ రంగు చీరలో నువ్వు చాలా అందంగా కనిపిస్తున్నావ్. ఆ చీరకు నువ్వు తొడుక్కున్న బ్లౌజు చక్కగా మాచ్ అయింది. మా మహిళామండలి సభ్యులు నా సెలెక్షన్ బాగుంటుందని మెచ్చుకుంటూ ఉంటారు. నన్ను షాపింగ్‌కు తీసుకు వెళ్తా ఉంటారు. అందుకే మా ఊళ్ళో నాకు ఒక నిముషం కూడా తీరిక దొరకదు కీర్తీ!' అంది అన్నపూర్ణ.

పాపం, ఆ అమ్మాయ్ అమాయకంగా కనిపిస్తోంది. బోరుకొడుతోందని చెప్పటానికి బిడియపడుతుందేమో, అన్నపూర్ణ చెప్పినదంతా వింటూ ఊ కొడుతోంది - ఆ ప్రక్కన కూర్చుని ఉంటే లాభం లేదనుకుని విష్ణువర్ధన్ అప్పర్ బెర్తుమీదకు వెళ్లిపోయాడు.

రైలు విజయవాడదాటి కాజీపేట మార్గం పట్టింది. బెర్తుమీద అటూ యిటూ దొర్లినా విష్ణువర్ధన్‌కి నిద్రపట్టలేదు. మహిళామండలి సభ్యుల గురించి, వారి ఆశయాల గురించి చెప్పుకుపోతోంది అన్నపూర్ణ.

మహిళామండలి ఆశయాలు మంచివే- కాని వాటిని ఆచరణలో పెట్టిన వారెందరు? వేదికలపై రాజకీయ నాయకులు చెప్పే వాగ్దానాల్లా ఉండిపోతాయి ఆ ఆశయాలు... వితంతు వివాహాలను ప్రోత్సహించాలి, కులాంతర వివాహాలకు అడ్డుపెట్ట కూడదు... సమయం దొరికినప్పుడు వేదికల మీద ఎల్లప్పుడూ చెబుతూ ఉంటుంది అన్నపూర్ణ. కాని ఆచరణలో పెట్టడానికి అన్నపూర్ణ కూడా ముందుకురాదు - ఆ విషయం విష్ణువర్ధన్‌కి తెలియనిది కాదు... ఆలోచిస్తూ అప్పర్‌బెర్త్ మీదున్న విష్ణువర్ధన్ నిద్రాదేవత వొడిలోకి జారిపోయాడు.

'మీరుండేది విశాఖపట్నంలోనా?' అడిగింది క్రింద బెర్తులో కూర్చుని ఉన్న అన్నపూర్ణ.

'ఔను', చెప్పింది కీర్తి.

'ఏ కాలనీలో?'

'సీతమ్మదార దగ్గర.'

'ఢిల్లీ నుండి ఎప్పుడు తిరిగొస్తారు?'

'పది రోజుల్లో-'

కీర్తి చెప్పింది విని ఆలోచనలో పడింది అన్నపూర్ణ. తరువాత తన హేండ్‌బ్యాగ్‌లోని డైరీ తీసి పేజీలు తిప్పి మళ్లీ యధాస్థానంలో డైరీని పెట్టేంది. కీర్తివాళ్లు ఢిల్లీనుండి విశాఖపట్నం చేరుకోకముందే విష్ణువర్ధన్, తను ఖమ్మం, హైద్రాబాద్ ట్రిప్పు పూర్తిచేసుకుని వైజాగ్ చేరుకుంటున్నట్లు డైరీలో తను రాసుకున్న ప్రోగ్రామ్ వలన తెలుసుకుని సంతోషించింది అన్నపూర్ణ.

'మీరెంతవరకు వెళ్తున్నారు ఆంటీ?' అడిగింది కీర్తి అన్నపూర్ణ ముఖంలోకి చూస్తూ.

'మొదట హైద్రాబాద్ వెళ్లాలనుకున్నాము అమ్మాయ్. ఫ్లైట్ టిక్కెట్లు కూడా మా వారు తెప్పించారు. కాని ఖమ్మంలో ఒక పని పడింది. అందువలన ఫ్లైట్ టికెట్లు కాన్సిల్ చేయించి యీబండి పట్టుకున్నాము. ఈరోజు, రేపు ఖమ్మంలో ఉండి ఆతర్వాత హైద్రాబాద్ వెళ్తాము... అదిసరే, నువ్వెంతవరకు చదువుకున్నావమ్మాయ్?'

'ఇంటర్ వరకు -' చెప్పింది కీర్తి.

'చదువుకుఅంతం ఎక్కడుందిలే... నేను ఎమ్మే పాసయ్యాను, నేనేమైనా ఉద్యోగం చేసి డబ్బు సంపాదిస్తున్నానా?! - సోషల్ సర్వీసు చేస్తున్నాను... మనిషికి ముఖ్యంగా కావల్సింది మంచి మనస్సు.' నవ్వుతూ అన్నపూర్ణ కీర్తి ముఖంలోకి చూసింది.

'నేను తిరిగి ప్రశ్నిస్తున్నానని ఏమీ అనుకోరు కదా ఆంటీ - నాకు తెలియక అడుగుతాను - మంచి మనసు కలవారందరు అదృష్టవంతులంటారా?' అడిగింది కీర్తి.

'ఎందుకు నీకు అలాంటి సందేహం వచ్చింది?' నువ్వు ఎక్కువ చదువుకోకపోతేయేం - నువ్వు అదృష్టవంతురాలివి కాదా?'

'ఏమి అదృష్టమో ఏమో-' నిట్టూర్చింది కీర్తి.

'ఇంత చిన్నవయస్సులో అలా విరక్తిగా మాట్లాడకూడదు... ఏం, మీ నాన్నగారు నీ మాట కాదనగలరా?' తిరిగి ఎదురుప్రశ్న వేసిది అన్నపూర్ణ.

'మా నాన్నగారు ఉంటే కదా, నామాట కాదనటానికి.'

'ఆ బెర్తులో పడుకుని దగ్గుతున్న వారు మీ నాన్నగారు కాదా?'

'కాదు - వారు మా శ్రీవారు.

కీర్తి చెప్పిన చివరిమాట చెవిని పడగానే అన్నపూర్ణ గుండె ఝల్లుమంది. ఆమెమెడలో వ్రేలాడే నల్లపూస దండ, మంగళసూత్రం అంతవరకు అన్నపూర్ణ గమనించలేనేదు. కీర్తి - ముక్కుపచ్చలారని కీర్తి ఆ ముసలాయన భార్యగా తలచుకుని కొన్ని క్షణాలు రెండు కళ్లు మూసుకుంది అన్నపూర్ణ.

కీర్తి ఆ ముసలాయన కూతురై ఉంటుందనుకుంది అన్నపూర్ణ. అతను నిద్రనుండి లేచి కూర్చోగానే - మీ కీర్తిని మా కోడలుగా చేసుకోవాలనుకుంటున్నానండీ - అన్న వార్త అతని చెవిని వేయాలనుకుని ఆశపడింది ఆమె.

అప్పర్‌బెర్త్ మీద విష్ణువర్ధన్, అటువైపు లోయర్ బెర్త్‌మీద కీర్తి భర్త శ్రీపతి బాగా నిద్రతీస్తున్నారు.

రైలు మంచి వేగంతో సాగిపోతూంది.

నిశ్శబ్దం కొన్నిక్షణాలు- కీర్తి, అన్నపూర్ణల మధ్య రాజ్యం చేసిన తర్వాత అన్నపూర్ణ అడిగింది -

'అందానికి అందం, ఇంటర్ వరకు చదువు, మంచి మనసు కలదానివి - నువ్వు వయసు మళ్లిన వ్యక్తిని పెళ్లిచేసుకోవటానికి గల కారణం ఏమై ఉంటుంది?'

'కన్నతల్లి కడుపులో పడ్డ కొన్ని రోజులకే తండ్రిని, ఈ భూమి మీద కాలుమోపిన మరుక్షణం జన్మ నిచ్చిన మాతృమూర్తిని పోగొట్టుకున్నాను. మేనమామ యింట్లో తలదాచుకోక తప్పలేదు. మొదట్లో మా మేనమామ ఎటువంటి యిబ్బంది పెట్టలేదు. ఆ తర్వాత మా అత్త - అంటే అతని భార్య శాశ్వతంగా కన్నుమూయడంతో నా కష్టాలు ప్రారంభమయ్యాయి. అప్పటికి నా వయసు పదహారు.

ఇంటర్ పూర్తిచేసి ఇంట్లో కూర్చున్నాను. అప్పటికే మా మేనమామ దుర్వ్యసనాలకు దాసుడయ్యాడు . తాగుడు మైకంలో బాగా పొద్దుపోయాక గాని యింటికి చేరుకునేవాడు కాదు. నన్ను చిత్రహింస పెట్టేవాడు. మీ మావయ్య బాగుపడాలంటే అతన్ని నువ్వు పెళ్లిచేసుకోక తప్పదు - అన్నారు ఊళ్ళోని పెద్దలు. వారి మాటను కాదనలేక, వయసు గురించి ముందు, వెనుక ఆలోచించక మా మావయ్యను పెళ్లి చేసుకున్నాను. ఇప్పుడు వారిఆరోగ్యందెబ్బతింది. ఢిల్లీలో స్పెషలిస్టుని కలుసుకోవటానికి వెళ్తున్నాము' చెప్పింది కీర్తి.

'మీ ఆయన త్వరగా కోల్కొని మంచి ఆరోగ్యాన్ని పుంజుకుంటారు. నువ్వు ధైర్యంగా ఉండు.' చెమ్మగిల్లిన కళ్లను తుడుచుకుంటూ ధైర్యం చెప్పింది అన్నపూర్ణ.

ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ ఖమ్మం చేరుకుంది, అప్పర్ బెర్తుమీద పడుకున్న విష్ణువర్ధన్ బ్యాగ్ పుచ్చుకుని రైలు దిగాడు.

'చూడు కీర్తీ! మేము యిక్కడ దిగిపోతున్నాము. మీరు ఢిల్లీనుండి వైజాగ్ తిరిగి వచ్చేసరికి మేము కూడా వైజాగ్ చేరుకుంటాము. నీకు ఏదైనా అవసరం ఉంటే మా యింటికి కబురంపు' అంటూ విజిటింగ్ కార్డు ఒకటి ఆమె చేతిలో పెట్టి రైలుపెట్టెనుండి క్రిందకు దిగింది అన్నపూర్ణ.

** *** **

తెల్లవారుజామున నాలుగున్నర గంటలకు భారీ వర్షం కారణంగా మంచిర్యాల్ స్టేషన్‌కు దగ్గరలో ఉన్న ఒక చిన్న వంతెనను దాటుకుని వెళ్తున్న ఢిల్లీ ఎక్స్‌ప్రెస్ పట్టాలు తప్పడం, కొన్ని రైలు పెట్టెలు వంతెన క్రింద పారే నీటిలోపడి కొట్టుకుపోవడం వలన సుమారు యాభైయైదు మంది ప్రయాణీకులు ప్రాణాలను కోల్పోయారన్న వార్త రేడియోలో వినగానే తాము ఖమ్మంలో దిగిపోయినందువలన పెద్ద గండాన్ని తప్పించుకున్నామని సంతోషించారు విష్ణువర్ధన్, అన్నపూర్ణ. కాని ఆ మర్నాడు దినపత్రికలో ప్రచురింపబడిన మృతుల జాబితాలో కీర్తి భర్త శ్రీపతి పేరు చూసి చాలా విచారించారు ఆ యిద్దరు.

** *** **

హైదరాబాద్ నుండి తిరిగి వచ్చిన రెండు నెలల వరకు కీర్తిని కలుసుకునే అవకాశం కలగలేదు అన్నపూర్ణకు. విష్ణువర్ధన్ కూడా తరచు బిజినెస్ పనిమీద పైఊర్లలో ఎక్కువ కాలం గడుపుతున్నాడు.

ఒకరోజు బొంబాయిలో పని చూసుకుని తిరిగి వచ్చాడు విష్ణువర్ధన్. ఆ రాత్రి డిన్నర్ పూర్తికాగానే అన్నపూర్ణ చెప్పింది - ఆ మర్నాడు కీర్తి యింటికి వెళ్లాలనుకుంటున్నానని.

'నువ్వు ఆమె యింటికి వెళ్లనక్కర్లేదు. కీర్తే మన యింటికి వస్తుంది' చెప్పాడు విష్ణువర్ధన్ చేతులు కదుగుకుంటూ.

'భర్తనుపోగొట్టుకున్న కీర్తిని ముందుగా మనం వెళ్లి చూడాలి కాని...' ఆశ్చర్యంగా భర్త ముఖంలోకి చూసింది అన్నపూర్ణ.

'అది నిజమే - కాని కీర్తి మన యింటికి వస్తుందని చెబుతున్నాను.'

'కీర్తి మన యింటికి రావడమేమిటి?'

'ఇప్పుడు కీర్తి మన కోడలు — మన అబ్బాయి కామేశం, కీర్తి రిజిస్ట్రార్ ఆఫీసులో పెళ్లి చేసుకుని హనీమూన్‌కని బొంబాయి వెళ్ళారు. అక్కడ తాజ్ హోటల్లో ఆ యిరువురిని నేను చూశాను.'

'మన అబ్బాయి కీర్తిని పెళ్ళిచేసుకున్నాడా?' అన్నపూర్ణ గొంతు బొంగురుపోయింది.

'పెళ్లి చేసుకున్నాడు. తప్పా?' విష్ణువర్ధన్ సూటిగా చూశాడు ఆమెవైపు.

'అదికాదండి - ఆమె వితంతువు...'

'కావచ్చు. అంతమాత్రాన ముక్కుపచ్చలారని ఆమె మళ్లీ పెళ్లిచేసుకోవడం న్యాయం కాదంటావా? - లేక పెళ్లికూతుళ్లు కోకొల్లలుగా దొరికే యీదేశంలో మన సుపుత్రుడు వితంతువుని ఎలా పెళ్లిచేసుకున్నాడని ఆశ్చర్యపోతున్నావా?? కీర్తి మన కోడలైతే బాగుండునని ఆరోజు ఆమెను ట్రైన్లో చూడగానే నువ్వు ఆశించావు. ఇప్పుడు భర్తను పోగొట్టుకున్న వితంతువని అడ్డుపడుతున్నావు. మీ మహిళా మండలి ఆశయాలు ఆచరించతగ్గవి కాదా?'

'మన కామేశం కీర్తిని ఎప్పుడు చూశాడండీ?'

'నేనే చూపించాను. పెళ్లి చేసుకోమని ప్రోత్సహించాను. నాకు తెలుసు యీ సమాజాలు తమ ఆశయాలను ఆచరణలో పెట్టడానికి ముందుకు రావని. అందుకే నీకు తెలియకుండా యీ సంబంధాన్ని ప్రపోజ్ చేశాను. కీర్తి, కామేశం ఒకరినొకరు అర్థం చేసుకున్నారు. ఇద్దరి మనసులు కలిశాయి. పెళ్లిచేసుకున్నారు. అందుకే అన్నారు - మేరేజెస్ ఆర్ మేడ్ యిన్ ది హెవెన్ - అని. మనం నిమిత్తమాత్రులమే అన్నపూర్ణా?'

విష్ణువర్ధన్ మాటలు విని నోరుతెరవలేక పోయింది అన్నపూర్ణ.